ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రయివేటుకు ఇవ్వాలని పిలిచిన టెండర్లను రద్దు చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆయన మాట్లాడుతూ, పోర్టు డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు, సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి ఆసుపత్రి సేవలందిస్తోందని తెలిపారు. 40వేల మందికి సేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో 'మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్"గా 300 పడకల నిర్మాణం కోసం ప్రయివేటుకు ఇవ్వడాన్ని పోర్టులో ఉన్న యూనియన్లు అన్నీ వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఈ నెల 8వ తేదీన టెండరు ఓపెన్ చేయడానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రయివేటు చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు వైద్య సౌకర్యాల నుంచి దూరమవుతారని తెలిపారు. ఆరోగ్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు రాకుండా, కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచి నిర్ణయాలు తీసుకోవాలని యాజమాన్యాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత అని, పొందడం ఉద్యోగ, కార్మికుల హక్కు అని పేర్కొన్నారు. పోర్టు సొంత నిధులతోనే మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్టు డాక్టర్లను, ల్యాబ్ మిషనరీలను, నాణ్యమైన మందులను సొంతంగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని అడ్డుకునేందుకు అన్ని కార్మిక సంఘాలూ ఐక్యంగా ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెఎస్.కుమార్, రాఘవులు, శంకరరావు, గణేష్‌నాయుడు, విజయ్, జగన్, కుమార్, గోపాలకృష్ణ, ఈశ్వరరావు, భాస్కరరావు, మంగ్గి తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ సంరక్షణపై అవగాహనకు శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : గర్భాశయ సంరక్షణపై క్యాంపెయిన్ నిర్వహణకు శిక్షణ నిమిత్తం డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావును ఢిల్లీకి చెందిన బేయర్ జైదాస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు మనోజ్, డాక్టర్ దాలి మంగళవారం కలిశారు. ఆశా డే సందర్భంగా విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. న్యూ బోర్న్ కేరింగ్, గ్రోత్ మానిటరింగ్ చార్ట్, న్యుమోనియాను ఏ విధంగా ముందుగా తెలుసుకోవాలి? స్పేసింగ్ మెథడ్స్ పాటించడంపై వైద్య సిబ్బందికి, ఆశాలకు వివరించారు. మాతృ, శిశు సేవలకు సంబంధించి 0-5 ఏళ్ల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు గురించి, హోం బేస్డ్ న్యూ బోర్న్‌కేర్, హోం బేస్డ్ యంగ్ చైల్డ్ కేర్, ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ అఫ్ నియో నాటల్, చైల్డ్ ఇల్‌నెస్‌పై చార్టులు, బుక్ లెట్స్, ఐఇసి మెటీరియల్ ద్వారా వివరించారు. పిహెచ్‌సి వైద్యులు, పర్యవేక్షకుల బాధ్యతలు, ప్రభుత్వం సరఫరా చేసే ప్రేగ్నెన్సి కిట్స్ ప్రతి ఆశా కార్యకర్త వద్దా కనీసం 10 ఉండాలని, ఇ-ఆశా యాప్ సర్వీస్ అప్‌డేట్ చేయాలని, ఐరన్, ఫోలిక్ ఆసిడ్స్ మాత్రలు, విటమిన్

డిఎం అండ్ హెచ్‌ఒతో చర్చిస్తున్న బేయర్‌జైదాన్ ఫార్మా ప్రతినిధులు

అడ్మినిస్ట్రేషన్, హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి న్యూట్రిషన్, విహెచ్ఎస్ కమిటీలు గురించి ఆశాలు ప్రత్యేకించి శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రసవ సమయంలో ప్రమాదాన్ని గుర్తించి, మేటర్నల్ డెత్ రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, వి.నారాయణరావు, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం, పాల్గొన్నారు.

ఎయు కంప్యూటర్ సైన్స్ విభాగంలో తనిఖీ

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు నేతృత్వంలోని కమిటీ సభ్యులు ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం, న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విభాగాల్లో అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని విభాగాధిపతులకు సూచించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.

తరగతులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

యువత బాధ్యతాయుతంగా నడుచుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : యువత బాధ్యతాయుతంగా నడుచుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, విలువైన జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని మూడో పట్టణ ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యాన మంగళవారం మాదకద్రవ్యాలు నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను వాడటం వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు, చట్టపరమైన చర్యలకు బాధ్యులుగా నిలవాల్సి వస్తుందని చెప్పారు. ఇటువంటి పదార్థాలను వినియోగించడం, కలిగి ఉండడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సైబర్ నేరాలకు బాధ్యులుగా కాకుండా ఉండాలని అదే సమయంలో సైబర్ నేరాలు జరగకుండా నిరోధించడం లో యువత ముఖ్యభూమిక పోషించాలని చెప్పారు. మోటార్ వాహన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, లైసెన్స్ కలిగి ఉండడం వంటి ప్రాథమిక నియమాలను పాటించడం అవసరమన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, నియంత్రించడం మనందరి సమన్వయం, సహకారంతోనే సాధ్యపడుతుందని చెప్పారు. యువత రాష్ డ్రైవింగ్ మానుకోవాలని ఇది వారికి రహదారిపై ప్రయాణించే ఇతరులకు సైతం ప్రాణాంతకంగా మారుతోందని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే మీరంతా భవిష్యత్తుతరానికి మార్గ నిర్దేశకులుగా నిలవాలని చెప్పారు.

విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. సమాజంలో అనేక ఆకర్షణలు యువతను పెడతోవ పట్టించే దిశగా నడిపిస్తాయిని, వీటి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు, క్రమశిక్షణతో ముందుకు సాగితే అందమైన భవిష్యత్తు సాకారం అవుతుందని చెప్పారు. పెడతోవపట్టి, చట్ట వ్యతిరేకంగా నడుచుకుంటే భవిష్యత్తు అంధకారమై సమాజం, కుటుంబం నుంచి అవమానాలు పొందాల్సిన అవసరం ఏర్పడుతుందని హితవు పలికారు. ఉన్నతంగా చదువుకునే యువత విచక్షణతో ఆలోచిస్తూ, సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సాల్మన్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ రాము, డాక్టర్ మూర్తి, డాక్టర్ హేమలత, డాక్టర్ వినీల కుమారి తదితరులు పాల్గొన్నారు.

26న దేశవ్యాప్త ఆందోళనలను జయప్రదం చేయండి

రైతు, కార్మిక సంఘాల సమావేశంలో మర్రాపు సూర్యనారాయణ

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రైతు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 26న దేశవ్యాప్త ఆందోళనలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మంగళవారం కిసాన్ సంయుక్త మోర్చా కన్వీనర్ కర్రి అప్పారావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, అసంఘటితరంగ కార్మికులైన భవన నిర్మాణ కార్మికులు, ఆటో, హమాలి, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని కోరారు. ఢిల్లీలో రైతాంగ పోరాటం సందర్భంగా మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలన్నారు. పాల రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని, నిత్యావసరాల సరుకుల ధరలు తగ్గించాలని, మూసివేసిన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించి, ప్రతీనెలా 5 వతేదిలోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకోసం నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో జరిగే ఆందోళనలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ కన్వీనర్ వైఎన్ భద్రం, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కోరిబిల్లి శంకరరావు, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ బాలు గాడి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, ఎపి గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరాం, ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, సిఐటియు నేతలు వివి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపికైన సత్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి - యలమంచిలి

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు యలమంచిలి సత్య స్పోర్ట్స్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి 15 తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో గురునానక్ దేవ్ యూనివర్శిటీలో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండా పోటీల్లో తమ అకాడమీకి చెందిన జయశ్రీ (జెఎన్‌యు), శ్వేత (ఆంధ్రాయూనివర్సిటీ) పాల్గొంటారని వెల్లడించారు. అలాగే పోలవరపు సస్మిత, నగిరెడ్డి మోహిత్‌లు అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ తరపున ఈ నెల 8 నుండి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్ విధాషిలో జరుగు జాతీయ తైక్వాండా పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు కోచ్‌తో పాటు స్కూల్ గేమ్స్ పిడిలు, ఫెడరేషన్ సభ్యులు, పిఈటిలు అభినందనలు తెలిపారు.

రేపు విశాఖ డెయిరీ పాడి రైతుల సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ డెయిరీ పాల రైతుల జిల్లా విస్తృతస్థాయి సమావేశం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనంలో ఈనెల 7న జరుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవు పాలకు విశాఖ డెయిరీ తగ్గించిన మూడు రూపాయలు ధరను పెంచాలని గత నెల 29న చేసిన ధర్నాపై జరిగిన విషయాలు చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి పాల రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యకర్తలు సకాలంలో రావాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీ ఎస్టీ పిఓఏ చట్టంపై గురువారం స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సమావేశ మందిరంలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్, విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ ముఖ్య అతిథులుగా, న్యాయ నిపుణులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

అద్దం లేకుండా హైదరాబాద్‌కు పయనం

ప్రైవేట్ బస్సు యాజమాన్యం నిర్వాకం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

బస్సుల్లో హైవే రోడ్లపై ప్రయాణం చేయాలంటే జనం గుండె గుభేలుమంటుందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. మరి అదే బస్సుకు ప్రధానమైన అద్దం లేకపోతే పరిస్థితి ఏమిటో వేరే చెప్పాలా ?. ఎదురుగా వచ్చే దుమ్ము, ధూళి డ్రైవర్ కంట్లో నేరుగా పడితే ఎలా ? అన్న విషయం కూడా ఆ బస్సు యాజమాన్యం పట్టించుకోకుండా ఉందంటే నిర్వహణ ఎంత హీనంగా ఉందో ఇట్టే తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం ఓ ప్రైవేటు బస్సు విశాఖ నుంచి అద్దం లేకుండానే హైదరాబాద్ గమ్యస్థానానికి బయలుదేరడం పలువురి కంట పడింది. ఎన్ఎల్ 83043 నెంబరుగల ఈ ప్రైవేట్ బస్సు విశాఖ రోడ్లపై చక్కర్లు కొడుతూ కనిపించింది. హైదరాబాద్ వరకూ ముందు అద్దం లేకుండా డ్రైవర్ ఎలా తీసుకెళ్తాడో ఏమోగాని కొంతమంది ప్రయాణికులు మాత్రం దీని గురించి చర్చించుకుంటూనే బస్సు ఎక్కారు. కనీస నిర్వహణపై ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు శ్రద్ధ పెట్టకపోవడం, జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయం, పోలీసులు సైతం ఈ బస్సు వ్యవహారాన్ని పట్టించుకోకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించింది. పలువురు ఈ బస్సుకు అద్దం లేకపోవడం చూసి ముక్కున వేలేసుకోవడం కనిపించింది.

అద్దం లేకుండా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

తప్పుడు పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై అసభ్యకర పదజాలంతో, అసభ్యకర దృశ్యాలను 'ఎక్స్'లో పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నాయకులు మంగళవారం దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళలపై గౌరవం లేకుండా ఇటువంటి తప్పుడు పోస్టులపై సైబర్ చట్టాలు, బీఎన్ఎస్ చట్టాల ప్రకారం శిక్షించాలని కోరారు. మళ్లీ ఇటువంటి పోస్టులు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో రోగాలకు దూరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆయుర్వేద వైద్య విధానం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని, తగ్గించవచ్చని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు కే లావణ్య తెలిపారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పిహెచ్సి పరిధిలో ఆశాలకు ఆయుర్వేద వైద్యంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయుర్వేదంలో వైద్య విధానాలు, తెలుసుకోవలసిన ఆహార పద్ధతులు, జీవన విధానంలో రుగ్మతలు తొలగించే ప్రక్రియలు, వైద్యానికి ఉపకరించే మొక్కలు వంటి అంశాలపై వివరించారు. ప్రాణాయామం, ధ్యాన పద్ధతులను యోగ టీచర్ బి అప్పారావు తెలియజేశారు. అనంతరం ఆయుర్వేద వైద్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యురాలు నజరత్, డాక్టర్ వాణి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

కల్తీ విత్తనాలతో కేళీలు

వరి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం

వ్యాపారులు అధిక ధరకు విక్రయించిన విత్తనాలు కల్తీ కావడంతో పంట ఎదుగుదలలో తేడాలతో పంట సగానికి పైగా కేళీలు వచ్చాయి. ఈ కేళీలు వల్ల పంట దిగుబడిపై అధిక ప్రభావం చూపి నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు రైతులకు అందకపోవడంతో అధిక శాతం ఉంది ప్రైవేటు వ్యాపారుల వద్ద కేజీ 50 రూపాయలు చొప్పున కొనుగోలు చేసి నారు వేశారు. విత్తనం సరిగా లేనప్పుడు మొలకెత్తడంలో తేడా కనిపిస్తుంది. అయితే ఈఏడాది అదేమీ లేకుండా విత్తనాలు బాగా మొలకెత్తి నారు ఏపుగా పెరిగింది. దీంతో రైతులు ఆ విత్తనాలు మేలురకమని భావించి నాటారు. తీరా పంట పొట్ట దశ వచ్చేసరికి విత్తనాల్లో ఉన్న కల్తీ బయటపడింది. పంటలో అధిక భాగం కేళీలు వచ్చాయి. ప్రభుత్వం, ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుక్కున్న విత్తనాలు ఒకే రకంగా ఉన్నాయి. దీనిపై రైతులు ఫిర్యాదు చేయడంతో మండలంలోని లక్ష్మీపురం పొలాల్లోకి వ్యవసాయ అధికారులు వచ్చి పంటలను పరిశీలించారు. విత్తనాలు కల్తీ వలన సగానికి పైగా వరి కంకి పక్వానికి రాగా, మరి కొన్ని దుబ్బులు పొట్ట దశలోనే ఉన్నాయి. దీంతో పంట పూర్తిగా పండేసరికి ముందుగా వచ్చిన కల్తీ విత్తనాలు నేలపాలు అవుతాయని రైతులంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా విత్తనాలు విక్రయించిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని, నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం అందువాలని రైతులు కోరుతున్నారు.

కేళీలకు కంకిలు రాగా, మిగిలిన చేను పొట్ట దశలో ఉన్న దృశ్యం

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

భక్తులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : నాగులచవితి సందర్భంగా మంగళవారం శ్రీచినరామస్వామి కోవెల వద్ద నూకాంబిక మహిళ సంఘం ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేశారు. ఇందులో జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి, జనసేన పార్టీ నాయకులు పెంటకోట గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని పుట్టలో పాలు వేయడానికి వెళ్లి వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విల్లూరి సురేష్, విల్లూరి పెదరాజు, మళ్ల వెంకటేష్, మల్ల వెంకట్రావు, ప్రకాష్, బుద్ధ సోమునాయుడు, నూకాంబిక సంఘం మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన పంచరాత్రుల మహోత్సవాలు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలిలోని భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వర పంచరాత్రులు మహెూత్సవాలు మంగళవారం భారీ తీర్థంతో ముగిశాయి. పరిసర ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో తులసీనగర్, మెయిన్‌రోడ్డు, పాతవీధి ప్రాంతాలు కిక్కిరిసాయి. భారీ కటౌట్లు, మిరుమిట్లు గొలికే లైటింగ్ ఆకర్షనీయ విద్యుత్ వైలుగులతో యలమంచిలి వెలిగిపోయింది. ప్రజలు తండోపతండాలు చేరుకొని వాటిని తిలకించారు. ఐదు రాత్రులు చిన్న వ్యాపారులు, బొమ్మలు, తినుబండారాలు అమ్మేవారు, విగ్రహాలు అమ్మే వ్యాపారులు, సర్కస్, స్టేజి డాన్సులతో మెయిన్ రోడ్డు కిటకిట లాడింది. దీపావళి నుండి నాగులచవితి వరకూ జరిగే ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా అమ్మవారిని సందర్శంచుకున్నారు. కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనాలు దారి మళ్లించినట్లు డిఎస్పీ సత్యనారాయణ తెలిపారు. స్టేజి కార్యక్రమాలను రాత్రి 11 గంటలకు ముగిసేలా చర్యలు చేపట్టామని సిఐ ధనుంజరావు, ఎస్‌లు సావిత్రమ్మ, రామకృష్ణలు తెలిపారు.

ఎస్ఇగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు : ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్‌గా చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఇ సివిల్‌గా పని చేసిన రామభద్రరాజును పోలవరం ప్రాజెక్టుకు ఇటీవల జెన్‌కో ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్ట్ ఎస్ఈ సివిల్‌గా కొనసాగుతున్న చంద్రశేఖర్ రెడ్డికి సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏపీ జెన్కో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

దీపం లబ్ధిదారుల ఇంటి వద్దే ఇకెవైసి

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరు 1967
జిల్లా జాయింట్ కలెక్టరు ఎం.జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

దీపం-2 పథకం లబ్ధిదారులకు అవసరమైన ఇకెవైసీ ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్‌ల ద్వారా లబ్ధిదారుని ఇంటివద్దే ఉచితంగా చేయించడానికి చర్యలు తీసుకున్నట్లు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులైన పేద కుటుంబాలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందజేస్తున్న దీపం 2 పథకాన్ని అక్టోబరు 31 అనకాపల్లి జిల్లాలో అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పథకంలో ప్రజల సౌకర్యార్థం మరి కొన్ని వెసులుబాట్లు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద మొదటసారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందగోరు లబ్దిదారులు అక్టోబరు 29 తేది నుండి 2025 సంవత్సరం మార్చి 31 తేది వరకు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకుంటే మొదటి విడత ఉచిత సిలిండర్ సరఫరా అవుతుందన్నారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డెలివరీబాయ్ వినియోగదారుని ఇంటికి గ్యాస్ తెచ్చినప్పుడు ఖాళీ గ్యాస్ సిలిండర్ సిద్ధంగా ఉంచుకోవాలని, లబ్ధిదారుడు ఈ పథకం కింద తీసుకున్న గ్యాస్ సిలిండర్ ఇతరులకు ఇవ్వరాదని, వారు మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. "కేవైసీ"కి ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఈ దీపం-2 పథకంపై లబ్దిదారులు తమకేమైనా అసౌకర్యం లేదా సూచనలు లేదా ఆక్షేపణలు తమ సంబంధిత వార్డ్ లేదా గ్రామ సచివాలయంలో, లేదా టోల్ ఫ్రీ నెంబరు 1967 ఫోన్ చేసి తెలియజేస్తే సత్వర చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ పథాకాన్ని లద్ధిదారులు వినియోగించుకొని ఎటువంటి అవకతవకలకు గాని, "బ్లాక్ మార్కెట్"కు తరలించడం గాని పాల్పడరాదని లబ్దిదారులు జెసి విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికి నోచని గుల్లేపల్లి శివారు గ్రామాలు

- రహదారి సౌకర్యం లేక ఇక్కట్లు
- వీధి రోడ్లు, డ్రెయినేజీలు కూడా లేని వైనం

చిన్న మట్టిదారి

గెడ్డపై లేని వంతెన

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని గుల్లేపల్లి శివారు గ్రామాలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. వాహనాల మాట అటు ఉంచి కనీసం 108 అంబులెన్స్ కూడా వెళ్లే పరిస్థితి ఆ గ్రామాలకు లేదు. రహదారి సౌకర్యం లేక గుల్లేపల్లి శివారుగ్రామాలైన హిమగిరి కాలనీ, రామ్ నగర్, లచ్చన్నపేట గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయం, పాడి పశువుల ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. పాలును సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడువాడ పాల కేంద్రానికి ప్రతి రోజూ ఉదయం, రాత్రి కాలినడకన తీసుకెళ్తున్నారు. తమకు అవసరమైన నిత్యవసర సరుకుల కోసం నిత్యం ఈ రెండు కిలోమీటర్లు నడిచి వస్తుంటారు. అతి కష్టం మీద ఈ గ్రామాలకు మోటార్ బైకులు, ఆటోలు ప్రయాణిస్తాయి. వర్షం వచ్చిందంటే కాలనీలు సమీపంలోని పెద్ద గెడ్డ, చిట్టి గెడ్డ పొంగిపొర్లి శివారు గ్రామాలకు మిగతా ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. 2008లో అప్పటి ఎమ్మెల్యే పూడి మంగపతిరావు ఈ మూడు శివారు గ్రామాలకు కాలనీ ఇళ్లను మంజూరు చేయించారు. కాని నేటికీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేవు. ఇంటింటి కుళాయిలు కూడా నేటికీ పూర్తికాలేదు. మైదాన ప్రాంతం అయినప్పటికీ నేటికీ ఆరోగ్య సమస్యల విషయంలో 108 అంబులెన్స్ కూడా రాని దుస్థితి ఈ కాలనీలకు నెలకొంది. ఇప్పటికైనా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని గుల్లేపల్లి శివారు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో విజయగౌరి

(మొదటి పేజీ తరువాయి..) అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రగతిశీల భావాలు

విజయగౌరి చిన్ననాటి నుంచే ప్రగతిశీల భావాలు గలవారు. ఆమె అన్నయ్య తిరుపతిరావు ప్రోత్సాహంతో హైస్కూల్‌లో చదువుతుండగానే ఎస్ఎఫ్ఐలో చేరారు. అప్పటికే విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు భవాని వెంట వెళ్లేవారు. అలా మొదలైన ఆమెలో నాయకత్వ లక్షణాలు చదువు పూర్తయ్యేవరకు ఎస్ఎఫ్ఎఫ్ నాయకురాలిగా కొనసాగేలా చేశాయి. కాలేజీ స్థాయి నుంచి ఎస్ఎఫ్ఐలో క్రీయాశీలక కార్యకర్తగా, చురుకైన నాయకురాలిగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలల పాటు 20 మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

ఇదీ కుటుంబ నేపథ్యం

విజయగౌరి తండ్రి సంజీవి నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఈ ప్రభావం కుటుంబంపై ఉండడంతో అన్నదమ్ములు, అక్కచెల్లెలు అంతా ఉన్నత చదువులు అభ్యసించిన వారే. అంతకు మించి ప్రగతిశీల భావాలు గలవారు. ఉమ్మడి విజయనగరంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకతాటిపైకి తీసుకొస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన కీర్తిశేషులు కె.శేషగిరి మాస్టారు ఈమెకు స్వయాన తమ్ముడు. అన్న తిరుపతిరావు కూడా అభ్యుదయ భావాలగల వ్యక్తి. ఇంజినీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. చెల్లెలు రమాప్రభ సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతున్నారు. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పని చేస్తున్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ వివి.రవి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షుతన జరుగు ఈ సమవేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో నాగుల చవితి నాడు మంగళవారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయం ధూప దీప నైవేద్యాలతో నాగేంద్రుని పుట్టల వద్ద పూజలు చేసి సాయంత్రం గౌరీ పరమేశ్వరులు ఉత్సవం జరుపుకోవడం గత ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారం. ఉత్సవం సందర్భంగా గ్రామంలో అనేక చోట్ల స్టేజి వేషాలు లైటింగ్ ఏర్పాటు చేశారు. భారీ మందు గుండు సామగ్రితో గౌరీ పరమేశ్వరులు ఊరేగింపు నిర్వహించారు.

విద్యుదాఘాతానికి రెండు పాడి ఆవులు మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలం చౌడువాడ గ్రామంలో విద్యుత్ వైర్లు తెగిపడటంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు ఆవులు మృతి చెందాయి. మంగళవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అమరపల్లి నూకేశ్వరరావుకు చెందిన కళ్లం త్రీఫేస్ విద్యుత్ లైన్ కింద ఉంది. అప్పుడప్పుడు ఈ వైర్లు తెగిపడుతున్నాయి. ఇలాగే మంగళవారం తెల్లవారుజామున ఒక వైరు తెగి కళ్ళం బయట కట్టి ఉంచిన రెండు ఆవులపై పడింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు ఆవులు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ఈ ఆవులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబ సభ్యులు ఈ సంఘటనపై కన్నీరు మున్నీరవుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సంఘటనా స్థలంలో ఆవుల మృతదేహాలు

రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యంపై పివిటిజిల వినూత్న నిరసన

- హోంమంత్రి అనితకు విన్నవించినా స్పందన లేదని ఆవేదన
- 24న పాడేరు ఐటిడిఎ వద్ద ఆందోళనకు హెచ్చరిక

డోలీల్లో చిన్నారులను మోస్తూ పివిటిజిల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని ఆర్ల గ్రామం నుంచి జాజులబంద వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని పివిటిజి ఆదివాసీ గిరిజనులు మంగళవారం వినూత్న రీతిలో డోలీలు పట్టుకొని నాలుగు కిలోమీటర్లు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ల పంచాయతీ పిత్రి గడ్డ, నీలిబంద, జాజులు బంధలో పివిటిజి తెగకు చెందిన ఆదివాసీ గిరిజనులు 250 జనాభా కొండ శిఖరంపై నివసిస్తున్నామన్నారు. 2023-24 సంవత్సరంలో పాడేరు ఐటిడీఏ నుంచి ఉపాధి హామీ పథకం నిధులతో ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేశారన్నారు. దీనికి ఫారెస్ట్ అనుమతులు తీసుకున్నారని తెలిపారు. అయితే రూ.26 లక్షలు పనులు చేసినట్టు రికార్డు చూపించారని, కానీ బైకులు వెళ్లే పరిస్థితి కూడా లేదన్నారు.

2020లో మూడు గ్రామాల పివిటిజి గిరిజనులంతా ఇంటికి రూ.30వేలు చొప్పున సొంతంగా చందాలు వేసుకొని ప్రొక్లెయినర్‌తో రోడ్డు నిర్మాణం చేసుకున్నామన్నారు. ఈ రోడ్డును ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రాస్ట్ నిధులతో పనులు చేసే క్రమంలో ప్రొక్లెయినర్‌తో సంబంధిత కాంట్రాక్టర్ ఉన్న రోడ్డును కూడా ధ్వంసం చేసి, ఇపుడు బైకులు వెళ్లకుండా చేసేసారన్నారు. ఈ విషయంపై అనేక ఆందోళన చేశామని, ఎవరూ పట్టించుకోలేదన్నారు. గత నెల 23న విశాఖపట్నం జెడ్పీ పాలకవర్గ సమావేశం వద్ద రోడ్డు పనులు ప్రారంభించాలని డోలీలతో ఆందోళన నిర్వహించామన్నారు. హోంమంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రం ఇచ్చినా, నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీనికి నిరసనగా పాడేరు ఐటిడిఎ వద్ద ఈ నెల 24వ తేదీన ఆదివాసి గిరిజన మహిళలు డోలితో ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పివిటిజి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మరి కామేష్, సంఘం అధ్యక్షులు కొండ తాంబలి వెంకట్రావు, సహాయ కార్యదర్శి గెమ్మెల చిన్నగమ్మిల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

దేవరాపల్లిలో నాగులచవితి పూజల్లో నేతలు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నాగుల చవితి పండగ మంగళవారం భక్తిశ్రద్ధలతో సాగింది. ప్రతి ఏటా దీపావళి వెళ్లిన ఐదో రోజున నిర్వహించే నాగుల చవితిని అన్నిచోట్లా సందడిగా జరుపుకున్నారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ జగదాంబ జంక్షన్ సమీపంలోని ఎల్లమ్మ తోటలో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు. దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా నాగుల చవితి పండగను జరుపుకున్నారు.నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు ముడసర్లోవ ప్రాంతంలో పుట్టలో పాలు పోశారు.

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, దేవరాపల్లిలో మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, ఎం. అలమండలో పోతల పాత్రునాయుడు, రైవాడ లో అనకాపల్లి పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, గ్రామ సర్పంచ్ చల్లా లక్ష్మీనాయుడు, బి. కింతాడలో మండల టిడిపి ఉపాధ్యక్షుడు కొమర బాబురావు, గ్రామ సర్పంచ్ బూరె బాబురావు తమ కుటుంబ సభ్యులతో నాగులచవితి సందర్భంగా నాగేంద్ర స్వామిని దర్శించుకుని పాలాభిషేకం చేశారు.

పారిశ్రామికవేత్త బివి.రామారావు

ఆరోగ్యం విషమం

బివి.రామారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సూక్ష్మ చిన్న పరిశ్రమల ప్రోత్సాహక కర్త బివి.రామారావు (80) ఆరోగ్యం విషమంగా ఉంది. ఆయన కుమారుడు తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. వయోభారం కారణంగా రామారావు అంతర్గత అవయవాల పనితీరు మందగించిందని, ప్రస్తుతం ఆయన మెడికవర్ ఆసుపత్రిలో వెంటిలెటర్‌పై చికిత్స పొందుతున్నారని చెప్పారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను కలిగి ఉన్న రామారావు 1994లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మొట్టమొదట కోరుకున్నారని తెలిపారు. పారిశ్రామిక ప్రగతి కోసం కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆమరణ నిరాహార దీక్ష చేసి పలు డిమాండ్లు సాధించారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయినప్పుడు మూడు శాతం స్టాంప్ డ్యూటీ చేయించి, పారిశ్రామిక ప్రగతికి దోహదపడ్డారని తెలిపారు. తన తండ్రి రామారావు స్ఫూర్తితోనే తాను నడుచుకుంటున్నట్టు రామ్ వెల్లడించారు.

ఘనంగా సెయింట్ లూక్స్ గ్రాడ్యుయేషన్ వేడుకలు

పట్టాలు అందుకున్న విద్యార్థులతో విశాఖ ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో 36 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన ప్రముఖ నర్సింగ్ విద్యాసంస్థలైన సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, శ్రీమతి విజయా లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో బిఎస్‌సి గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని సిరిపురంలోగల విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ హాజరై బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసిన పట్టభద్రులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో, ప్రధానంగా మన రాష్ట్రంలో నర్సింగ్ విద్య అభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విదేశాలకి వెళ్లాల్సిన అవసరం లేకుండానే మంచి వేతనాన్ని గౌరవప్రదమైన ఈ నర్సింగ్ వృత్తితో పొందగలుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో 100 మంది నర్సింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సెంటర్ ఫర్ యోగా అండ్ వెల్‌నెస్ (ఎయు అనుబంధం)లో పీజీ డిప్లమో, డిప్లమో పూర్తి చేసిన విద్యార్థులకూ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించారు. గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్ సర్జరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.అర్జున మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంతో సేవా దృక్పథం కలిగిందని, రోగులకు ప్రాణం పోసేది డాక్టర్లతో పాటు నర్సులేనని అన్నారు. 36 ఏళ్లుగా సెయింట్ లూక్స్ నర్సింగ్ విద్యాసంస్థలు వేలాది మంది నర్సులకు ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ప్రభాకర్ శర్మ (అమెరికా), ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ అండ్ మిడ్ వైవ్స్, ఎఎన్ఎం అండ్ హెల్త్ విజిటర్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల, గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్ సర్జరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.అర్జున, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, సెయింట్ లూక్స్ విద్యాసంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ప్రీతం లూక్, ప్రతినిధులు ఎం.విజయా లూక్, మమతా ప్రసాద్, షావీలా ప్రీతం, షైనీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి పంట

ప్రజాశక్తి-రోలుగుంట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగా ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మీ తెలిపారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 1300 హెక్టార్లు కాగా, ఈ ఏడాది 1320 హెక్టార్లలో వరి నాట్లు వేయడం జరిగిందన్నారు. అదనంగా 20 హెక్టార్లలో మెరక ప్రాంతంలో వేయడం జరిగిందన్నారు. ప్రతి ఏటా ఆగస్టులో ఆగస్టులో ప్రారంభిస్తారని, కానీ ఈ ఏడాది మాత్రం జులై చివరి వారంలోనే నాట్లు వేశారని, ఇప్పటి వరకు వర్షాలు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సాంబమసూరి, సోనామసూరి వంటి తేలిక రకం పంటలు వెన్నులు వంచి కోతలు సిద్దంగా ఉన్నాయన్నారు. ఆర్‌జిఎల్ 1170, 1164 పంట రకాలు పొట్ట దశ నుండి ఈనే దశలోనే వచ్చాయన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం కొరకు నెలవారీ మేగ్‌జైన్ నెలకు రూ. 25 ం అవుతుందని, సంవత్సరానికి రూ.300 ఆసక్తి గల వారు కట్టాలని సూచించారు.

కెజిహెచ్‌కు బిఒఐ వితరణ

ఎండోస్కోప్ మిషన్ అందజేస్తున్న బిఒఐ ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బ్యాంకు అఫ్ ఇండియా విశాఖపట్నం జోన్ ఆధ్వర్యంలో కెజిహెచ్‌లోని గాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రూ.20 లక్షల విలువైన ఎండోస్కోప్స్ మెషిన్‌ను మంగళవారం వితరణగా అందించారు. ఈ ఎండోస్కోపిక్ యంత్రం రోగి అంతర్భాగాలను పరిశీలించడానికి ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో బ్యాంకు అఫ్ ఇండియా జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.సీతారామ్, బిఒఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.నాగేశ్వరరావు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ గిరినాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వంశీ యాదవ్, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు. బ్యాంకు అఫ్ ఇండియా వారికి శివానంద కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కల్పించరూ..

- టైరుబండ్ల వారికి అశనిపాతంగా ప్రభుత్వ ఇసుక విధానం
- గ్రామాల్లో వేలం పాట ద్వారా అక్రమ వసూళ్లు

కైలాసపట్నంలో పని దొరకక ఖాళీగా ఉన్న టైరు బండ్లు

ప్రజాశక్తి-కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ఉచిత ఇసుక పథకం టైర్ బళ్ల యజమానులకు ఆశనిపాతంగా మారిందనే విమర్శలున్నాయి.ఉచిత ఇసుక ప్రకటించక ముందు నదుల వద్దకు నేరుగా వెళ్లి ఇసుకను గ్రామీణ ప్రాంత అవసరాలకు అమ్ముకునేవారు. ఇలా రోజుకు ఒకటి రెండు ట్రిప్పులు వేసుకొని పొట్ట పోసుకునేవారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పథకం టైరు బళ్ళు దారులకు పొట్ట కొడుతోంది, మండల వ్యాప్తంగా దాదాపు 200వరకు టైరు బళ్ళు ద్వారా ఇసుకను అమ్ముకుని జీవిస్తున్నారు, పొందూరు, గొట్టువాడ, కైలాసపట్నం, కోటవురట్ల, చౌడవాడ, రాజుపేట ఎండపల్లి, ఆన్నవరం, నదీ పరివాహక ప్రాంతాలలో కాస్త కూస్తో దొరుకుతున్న ఇసుకను గ్రామీణ ప్రాంత అవసరాలకు అమ్ముకునేవారు, అయితే ఉచిత ఇసుక పథకం ప్రకటించిన తర్వాత అత్యధికంగా ఇసుక నిలువలు ఉన్న పందూరు, గొట్టువాడ, కైలాసపట్నం ప్రాంతాలలో ఎక్కువగా ఇసుకను తీసుకు వెళ్లేవారు, అయితే ఇప్పటికే గ్రామస్తులు నాయకులు గొట్టువాడ, పందూరు, ప్రాంతాలలో వేలంపాటలు నిర్వహించారు. అయితే ట్రాక్టర్లకు వేలంపాటదారులు డబ్బులు వసూలు చేస్తుండగా, టైరు బళ్లకు డబ్బులు ఇవ్వాలని నిబంధన పెట్టడం కారణం ఒకటైతే, టైరు బళ్ళు అధికంగా నదిలోకి ప్రవేశిస్తే ట్రాక్టర్లు వెళ్లేందుకు వేసే బాటలు ధ్వంసం అయిపోతాయని ఎడ్లబండ్లను వేలంపాటదారులు నిరాకరిస్తున్నట్లు వాపోతున్నారు.

ఇప్పటికే వేలంపాటలో నిర్వహించిన గ్రామాలలో ప్రభుత్వ అధికారులు ట్రాక్టర్లకు అనుమతులు ఇస్తున్నారు అయితే ఆ ట్రాక్టర్ల వద్ద నుంచి కూడా వేలంపాటదారులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది అయినా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం, అయితే కైలాసపట్నం కూడా వేలంపాట నిర్వహించే వరకు ఇసుకను తరలించవద్దంటూ గ్రామానికి చెందిన నాయకులు గ్రామస్తులు ఎడ్లబండ్లను నిలువరిస్తున్నారు, ఇటువంటి సందర్భంలో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పథకం వల్ల నష్టపోతున్నామని, జీవన ఉపాధికి ఎడ్లబండ్లను తోలుకుంటున్న తమకు ఆటంకం కలిగించడం పట్ల ఎడ్ల బండ్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు న్యాయం చేయాలని, ఉపాధి కల్పించాలని వేడుకుంటున్నారు. లేనిపక్షంలో కార్యాలయాల వద్ద నిరసన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

రేపు వర్చువల్‌గా చంద్రబాబు శంకుస్థాపన

వివరాలు చెబుతున్న డివిజనల్ ఇంజినీరు రామకృష్ణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో నూతనంగా ఏర్పాటుకు 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు అయిందని ఎపిఇపిడిసిఎల్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ, ఈ సబ్ స్టేషన్‌ను ఈనెల 7న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు.. రూ.67.35 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మిస్తున్నారని తెలిపారు. దీని వల్ల నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందని వ్యవసాయ రైతులకు, పరిశ్రమలు మరియు గృహ రంగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని లో ఓల్టేజ్ సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యుత్ పంపిణీ నష్టం నివారణ జరుగుతుందని తెలిపారు.. కార్యక్రమంలో ఎఇ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై చర్యలు తీసుకోండి

ధ్వంసమైన శిలాఫలకం

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం శివారు కొరుప్రోలులో రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని టిడిపి నాయకులు మద్దు నాయుడు, మాకిరెడ్డి శ్రీను మంగళవారం తెలిపారు. సుమారు 4కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణం కోసం ఈ నెల 6న ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు శంకుస్థాపన చేయనున్నారని, దీనికోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఇది కేవలం ప్రతిపక్ష నాయకులు కక్షపూరితంగా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇక్కడ ముగ్గురు వైసీపీ నాయకురాలు జడ్పిటీసీ పోతల లక్ష్మి రమణమ్మ, ఎంపీటీసీ నల్లి బోడమ్మ, ఎంకెపట్నం సర్పంచ్ బరిసింగి సూకాలమ్మ పేర్లను తొలగించకుండా టిడిపి నాయకుల పేర్లు మాత్రమే ధ్వంసం చేశారన్నారు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

అల్లూరి పార్కులో నీటికి కటకట

-పాడైన మోటారును పట్టించుకోని అధికారులు

నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకర్

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో మోటారు సుమారు 40 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో పర్యాటకులకు, పార్కులోని మొక్కలకు నీరు లేకుండా పోయింది. బోరు మోటారు మరమ్మతులకు గురైన విషయాన్ని పలుమార్లు అధికారులకు, పాలకులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పర్యాటకులు వాపోతున్నారు. ఏటా పలుమార్లు మోటారు పని చేయకపోయినా అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో తరచూ తాగునీరు సమస్య తప్పడం లేదు. ఇప్పటికైనా మోటారు మరమ్మత్తులు చేయించాలని, లేకుంటే కొత్త మోటారు వేయించాలని కోరుతున్నారు.

ఆశాల సమస్యలను పరిష్కరించకుంటే

18న చలో కలెక్టరేట్

- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వజ్రపు సత్యవతి
- సిఐటియు ఆధ్వర్యాన నిరసన, వినతులు అందజేత

రావికమతం పిహెచ్‌సిలో వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

ప్రజాశక్తి - రావికమతం :.ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వజ్రపు సత్యవతి డిమాండ్ చేశారు. మంగళవారం రావికమతం పిహెచ్‌సి వద్ద ఆందోళన చేపట్టి, పలు డిమాండ్స్‌తో వినతిపత్రాన్ని సిహెచ్‌ఒ హేమ సుందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫిబ్రవరిలో ఆశ వర్కర్లతో పలు సమస్యలపై చర్చలు జరిపి కొన్ని జిఒలను అంగీకరించిందన్నారు. ఈ లోగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో నాటి జిఒలు విడుదల కాలేదన్నారు. గత ప్రభుత్వంలో కుదుర్చుకున్న ఒప్పందాల జిఒలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు . ఆశాలుగా పనిచేస్తున్న వారిలో జిఎన్ఎమ్, ఏఎన్ఎం శిక్షణ పొందిన వారికి ఏఎన్ఎం లేదా హెల్త్ సెక్రటరీగా, స్టాఫ్ నర్స్‌గా నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. అలాగే ఆశాల జీతభత్యాలు పెంచాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవు, ఇన్సూరెన్స్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్, వేతనంతో కూడిన మెటర్నటీ మెడికల్ లీవు, ప్రభుత్వ సంక్షేమం పథకాలు అమలు చేయాలని కోరారు. రాజకీయ జోక్యం తగ్గించి, ఆశాల నియామకాన్ని ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అంగీకరించిన జిఒలను తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఈనెల 18న చలో కలెక్టరేట్ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు ఎస్. లక్ష్మి ,జి .పార్వతి, జగమ్మ ,కే .సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

రాంబిల్లి :తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ ఆశాలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన ఒప్పందాలు, జీవో కాపీలు విడుదల చేసి అమలు జరపాలని, ఆశాల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేట్రిన్ కుమారుడి ఆగడాలపై విచారణ

విద్యార్థినులను విచారిస్తున్న ఎస్‌డబ్ల్యుఒ శ్యామల

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం ఎస్‌సి బాలికల వసతి గృహంలో బాలికల సమస్యలపై నర్సీపట్నం ఎఎస్‌డబ్ల్యుఒ శ్యామల మంగళవారం విచారణ చేపట్టారు. హాస్టల్‌లోని బాలికల పట్ల మెట్రిన్ కుమార్తు ఆగడాలు, మెనూ అమలులో నిర్లక్ష్యం వంటి సమస్యలపై మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం రావడంతో ఎఎస్‌డబ్ల్యుఒ స్పందించారు. ఈ మేరకు వసతి గృహాన్ని సందర్శించి బాలికల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెట్రిన్ కొడుకు బాలికల పట్ల అసభ్య ప్రవర్తన ఆరోపణలలో వాస్తవాలు ఉన్నాయని, మెనూ అమలులో కూడా లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించడంతోపాటు తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

మెట్రిన్ లలితను విధుల నుంచి తొలగించండి

మెట్రిన్ లలితను విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జనార్ధన్, కె అర్జున్, సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె. గోవిందరావు తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం రావికమతం బాలికల వసతి గృహాన్ని వారు సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల పట్ల మెట్రిన్ కుమారుడు అసభ్యకర ప్రవర్తనను ఖండించారు. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా మెట్రిన్ కుమారుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే మెట్రిన్‌ను విధుల నుంచి తొలగించి, గతంలో విధులు నిర్వహించిన వార్డెన్ ను నియమించాలని కోరారు. అనంతరం ఎఎస్‌డబ్ల్యుఒ శ్యామల కు పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యానఎఎస్‌డబ్ల్యుఒకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థినులు

విజయగౌరి పరిచయ సభ దృశ్యాలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీస్తున్న యుటిఎఫ్, వివిధ సంఘాలు బలపరిచిన కోరెడ్ల విజయగౌరి పరిచయ సభ మంగళవారం సాయంత్రం విశాఖలోని డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ కెఎస్.చలం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, యుటిఎఫ్ సహ పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర వాణిని చట్టసభల్లో వినిపించేందుకు విజయగౌరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

విజయగౌరి పరిచయ సభలో మాట్లాడుతున్న కెఎస్.చలం

మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు

ఇసుక అక్రమాలకు వ్యతిరేకంగా

నేడు వైసిపి ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఉచిత ఇసుక పేరిట జరుగుతున్న అక్రమాలకు నిరసనగా ఈ నెల 6న నర్సీపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట నిర్వహించే శాంతియుత ధర్నాకు నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మీడియాకు పంపిన వీడియోలో, గత నెల 25వ తేదీ రాత్రి నర్సీపట్నం ఇసుక స్టాక్ పాయింట్లో ఇసుక దోపిడినితమ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు వెళ్లి అడ్డుకుని, లారీలను పోలీసులకు అప్పగించారన్నారు. అయితే పోలీసులు ఈ దోపిడి దొంగలకు అండగా ఉండటమే కాకుండా, ఇసుక అక్రమార్కులను, లారీలను విడిచిపెట్టారన్నారు. ఇసుక అక్రమ ఇసుక దోపిడిని, లారీలను అడ్డుకున్న వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. దీనికి నిరసనగా పోలీస్ స్టేషన్ ఎదుట ఈ శాంతియుత ధర్నా చేపడుతున్నామన్నారు. వైసిపి నాయకులపై ఏ విధమైన అక్రమ కేసులు బనాయిస్తున్నారో నియోజకవర్గ ప్రజలకు, పోలీసు ఉన్నతాధి కారులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ శాంతియుత ధర్నా చేపడు తున్నామని తెలిపారు. ధర్నాలో భాగంగా ముందుగా పట్టణంలోని వైసిపి కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళతామన్నారు.